నేటి దినపత్రిక
సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 04 మార్చి 2025 | పేజీలు 8

# అంతర్జాతీయ సదస్సుకు హాజరైన కమిషనర్ సూర్యతేజ

ఏషియా పసిఫిక్ 3ఆర్ అంతర్జాతీయ సదస్సులో కేంద్ర అర్బన్ అఫైర్స్ శాఖా మంత్రి మనోహర్ లాల్ కట్టర్ తో కలిసి నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ హాజరయ్యారు.



వివరాలు 3లో

# రైతుల గోడు

## మద్దతు ధర లేక నష్టాల పరుగు

### సోమిరెడ్డి దోపిడీలో హుషార్.. రైతులంటే బేజార్ !



వెంకటాచలం, మేజర్‌న్యూస్ :

సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలం కసుమూరు గ్రామంలో సోమవారం మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ధాన్యం రాసుల వెంబడి పర్యటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం అమ్ముకోలేక నష్టాల్లో కూరుకుపోయిన రైతుల ఆవేదనను ప్రత్యక్షంగా చూశారు.

**రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యం :**

రైతులు శ్రమించి పండించిన ధాన్యం విక్రయించేందుకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మద్దతు ధరగా క్వింటాకు రూ. 2,320లు ప్రభుత్వం ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో

-మిగతా 2లో

# జోరుగా.. 'బెల్టు' వ్యాపారం




- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
- అసహనం వ్యక్తం చేస్తున్న మహిళలు
- రూ.లక్షల్లో అధికారుల లావాదేవీలు

కావలి, మేజర్‌న్యూస్ :

రాష్ట్ర ప్రభుత్వం మద్యం సిండికేట్ల వ్యాపా రంపై ప్రత్యేక శ్రద్ధచూపుతూ.. మద్యంపై వచ్చే ఆదాయంతో ప్రభుత్వం నడుస్తుందనే విషయంలో నిజమేనని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు కానీ, కావలి పట్టణంలో మద్యం ఏరులై పారుతుందనే మాట నియోజ కవర్గంలో నిజమని అనుకోవాలి.. ఎందుకంటే ఎక్కడ చూసిన బెల్టుషాపుల మయమైపోయింది. కావలి పట్టణం చుట్టుపక్కల గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతూ.. చుట్టుపక్కల ప్రాంతాలలో నివసించే ప్రజలకు, మహిళలకు ఆటంకకరంగా ఉండడం విశేషం. అయితే మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు చూస్తూ చూడనట్టుగా అవుతున్నారని కావలి నియోజకవర్గంలో చర్చ జోరుగా సాగుతున్నాయి. ప్రతినెల మద్యం వ్యాపారస్తుల దగ్గర లక్షల్లో మామూలు తీసుకుంటూ.. బెల్ట్‌షాపులను అరికట్టాల్సిన అధికారులే 'కంచె చేను మేస్తే'గా ఉంటున్నారని కావలి పట్టణంలోని ప్రజలు, ప్రజా సంఘాలు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఇంత విచ్చలవిడిగా మద్యం పారలేదని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే మద్యం విచ్చలవిడిగా అమ్ముతూ.. ప్రతి సందుకీ బెల్టు దుకాణాలు మాదిరిగా గృహాల్లో సైతం ఈ మద్యం అమ్ముతున్నారని, ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంతో ఇంకా విచ్చలవిడిగా ఈ వ్యవహారం సాగుతుందని తెలిపారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి బెల్టుషాపులు లేకుండా మామూలు మత్తులో ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, బెల్టు షాపుల నిర్మూలన చేసి పరిసర ప్రాంత మహిళలకు, ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరుతున్నారు.



# బాధితుల సమస్యలను పరిష్కరించండి

**- జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశం**



నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :

జిల్లాలోని బాధితుల సమస్యలను తక్షణం పరిష్కారం మార్గం చూపాలని పోలీసు అధికారులను ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 85 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లో కొన్ని..

దర్గామిట్ట పరిధికి చెందిన మహిళకు ఇనిస్టాగ్రాంలో బారకాసు సెంటర్‌కు చెందిన సునీల్ అనే వ్యక్తి పరిచయమై, ఆడిషన్స్ పేరుతో హైదరాబాదుకు తీసుకెళ్ళాడని, మత్తుపానీయాలు ఇచ్చి అత్యాచారం చేసి, అసభ్యకరమైన పొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్ మెయిల్ చేయగా.. చాలాసార్లు నగదు ఇచ్చానని, అంతేకాకుండా నాపై దాడి చేసి నా మొబైల్ పగలగొట్టాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా పొదలకూరు పరిధికి చెందిన వ్యక్తిని, అదే గ్రామానికి చెందిన సునీల్ అనే వ్యక్తి హైదరాబాదు ఎయిర్ పోర్టులో సూపర్ వైజర్‌గా

-మిగతా 2లో

## సీఎం పాలనా దక్షతకు

# బడ్జెట్ అద్దం పడుతోంది



7లో

- రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం కృషి చేస్తున్నారు
- మహిళా సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు
- 2025-26 ఆర్థిక బడ్జెట్‌లో నెల్లూరు జిల్లాకు భారీ కేటాయింపులు
- సీఎం మార్గదర్శకత్వంలో నిత్యం ప్రజాసేవలో ఉంటాం

# ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించండి

## అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆనంద్ - ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 436 అర్జీలు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలపై ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సీఈవో విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు అం దించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు.

### డప్పు కళాకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి..

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సుమారు 500 డప్పు కళాకారుల కుటుంబాలు నివసిస్తున్నాయని, తమకు కొత్తూరు నుంచి ఆమంచర్లలోపు ఎక్కడైనా డప్పుకళాకారుల కాలనీ ఏర్పాటు చేసి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డప్పు కళాకారులు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. చాలీచాలనీ సంపాదనతో తామంతా చాలా ఇబ్బందులు పడుచున్నామని, ఉండటానికి ఇళ్లు కూడా లేదని, మానవతా దృక్పథంతో డప్పు కళాకారుల కాలనీని ఏర్పాటు చేసి తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వారు కలెక్టర్‌కు విన్నవించారు.

### అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి :

గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పేదల ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. పీఎంఏవై-ఎన్‌టిఆర్ గృహాలను అసంపూర్తిగా వదిలేయడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయాయని చెప్పారు. జిల్లాలో హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం వలన పనులు జరగడం లేదని, కోట్లల్లో హౌసింగ్ అక్రమాలు జరిగాయని, వెంటనే జిల్లాలో గృహ నిర్మాణాలు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

### ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 436 అర్జీలు..

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 436 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 169, పోలీసు శాఖకు 61, మున్సిపల్‌శాఖకు సంబంధించి 36, సర్వేకు 36, పంచాయతీరాజ్‌శాఖకు 34, విద్యుత్ శాఖకు సంబంధించి 9 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు సమస్యలపై శాసనమండలిలో ఎమ్మెల్సీ ప్రస్తావన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు చింతా రెడ్డిపాలెం నేషనల్ హైవే జంక్షన్ వద్ద ఫ్లైఓవర్‌ను, సర్వీసు రోడ్డును సత్వరమే ఏర్పాటు చేయా లని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశే ఖర్ రెడ్డి సోమవారం శాసన మండ లిలో తన సమస్యలను లేవనెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. నెల్లూరు చింతా రెడ్డిపాలెం నేషనల్ హైవే జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందన్నారు. అటు నెల్లూరు నుంచి చెన్నై విజయవాడ వైపు వెళ్లే అధిక వాహనాలు ఈ జంక్షన్ గుండా ప్రయాణాలు సాగించడంతో పాటుగా పెద్దఎత్తున వాహనాలు ఈ మార్గం గుండానే నెల్లూరు నగరంలోకి ప్రవేశిస్తుంటాయని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ కారణంగా ఇక్కడ ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుని ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ ప్రాంతంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడంతోపాటు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించే విధంగా సత్వరమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి తెలియజేశారు.

# రైతుల గోడు.. మద్దతు ధర లేక నష్టాల పరుగు

*(మొదటి పేజీ తరువాయి)*



అమలు చేయడంలో తీవ్ర విఫలమైందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారం భించామని అధికారులు ప్రకటించినా, అవి పూర్తి స్థాయిలో పనిచేయకపోవడంతో రైతుల గోడు తీరడం లేదన్నారు. ధాన్యం విక్రయానికి గోనె సంచులు కూడా అందుబాటులో లేకపోవడం రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు.

### చంద్రబాబు పాలన.. రైతులకు శాపమే !

చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా.. రైతులకు కష్టాలే తప్ప లాభం లేదని కాకాణి విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు క్వింటాకు రూ.2,500 నష్టం జరుగుతోందని, మద్దతు ధర కోసం కేవలం రూ.300 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించడం దారుణమన్నారు. జగన్ హయాంలో రూ.3 వేల కోట్లు ధరల స్థిరీకరణ నిధిగా ఏర్పాటు చేసి, రైతులకు న్యాయం చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు.

### సోమిరెడ్డి దోపిడీ - సాగునీటి నిధుల స్వాహా..

ఇటీవల సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేస్తూ, సోమిరెడ్డి సాగునీటి కాలువల పనులు చేయకుండానే బిల్లులు తీయించుకున్నారని కాకాణి విమర్శించారు. రైతులను అడ్డుపెట్టుకొని దోచుకోవడ మే తప్ప, వారి సంక్షేమం కోసం ఏ చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. వైసీపీ రైతుల కు అండగా ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు తక్షణం బోనస్ అందించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల హక్కుల కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. రైతులను నిర్లక్ష్యం చేసిన కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబితేనే.. రైతుల గోడు తీరుతుందన్నారు.

రైతులను వంచిస్తున్న ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేసిన డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి.. మద్దతు ధర అందే వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు.

## అంతర్జాతీయ సదస్సుకు హాజరైన కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్ జైపూర్ నగరంలో ఈనెల 3 నుంచి 5 తేదీ వరకు మూడు రోజులపాటు జరుగుతున్న ఏషియా పసిఫిక్ 3ఆర్ అంతర్జాతీయ సదస్సులో కేంద్ర అర్బన్ అఫైర్స్ శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌తో కలిసి నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ సోమవారం పాల్గొన్నారు. మొత్తం 38 దేశాల నుంచి ప్రతినిధులు సమావేశంలో పాల్గొని వ్యర్థాల నిర్వహణ అంశంపై వివిధ దేశాలలో చేపడుతున్న విధానాలను చర్చించారు. మూడు రోజులపాటు జపనీస్ సిటీస్, ఇండస్ట్రీస్ పవర్, ది అర్బన్ గ్రోత్ ఆఫ్ ఇండియా, ప్రైవేట్ కంపెనీస్, స్టార్ టాప్స్, పబ్లికేషన్ తదితర అంశాలపై పార్ట్నర్ ఏజెన్సీలతో చర్చలు జరపనున్నారు. రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్ (3ఆర్) విధానాలను తప్పనిసరిగా అన్ని దేశాల్లో అమలు చేసే విధంగా అన్ని దేశాల ప్రతినిధులు ఆలోచనలను విశ్లేషించారు.

## బాధితుల సమస్యలను పరిష్కరించండి

*(మొదటి పేజీ తరువాయి)*

పని చేస్తున్నట్లు, తన కుమారునికి ఎయిర్ పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి లక్షా 43 వేలు నగదు తీసుకొని, జాబ్ ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని విచారించి న్యాయం చేయాలన్నారు. దుత్తలూరు పరిధికి చెందిన వ్యక్తి.. తన కుమార్తె 2025 జనవరి 27న ఉదయగిరి ఆనకట్టలో దూకి మరణించినట్లు, తన మరణానికి భర్త, అత్తమామలపై అనుమానంగా ఉందని, మరణానికి కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. టీపీ గూడూరు పరిధికి చెందిన వృద్ధుడు.. తన చిన్న కుమారుడు వృద్ధాప్యంలో చూస్తానని నమ్మించి పేరు మీద ఇంటికి రాయించుకొని, ఇప్పుడు అసలు పట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్నాడని, విచారించి న్యాయం చేయాలన్నారు. వేదాయపాలెం పరిధికి చెందిన వ్యక్తిని, కోవూరుకు చెందిన చెంచులక్ష్మి అను మహిళ గతంలో తన కుమారునిపై కేసు పెట్టినట్లు, మాకు మా బంధువులకు పరువు ప్రతిష్టలు భంగం కలిగేలా సోషల్ మీడియాలో ఫోటోలు, మెసేజ్‌లు పంపి నగదు డిమాండ్ చేస్తున్నట్లు, విచారించి న్యాయం చేయాలన్నారు. నెల్లూరు నగరానికి చెందిన మహిళను తన భర్త తాగి, శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు, తనను, తన పిల్లలను పట్టించుకోవడంలేదని, అదేవిధంగా పొదలకూరు పరిధికి చెందిన మహిళను భర్త, అత్తమామలు వేధిస్తున్నారని, కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలన్నారు. నెల్లూరు రూరల్ పరిధికి చెందిన వ్యక్తిని, వడ్డిపాలెం వద్ద దేవిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి అనే అతని వద్ద ఫ్లాట్ కొన్నానని, తీరా విచారించగా డబల్ రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలిపారని, మోసపోయానని విచారించి న్యాయం చేయాలని కోరారు. టీపీ గూడూరు పరిధికి చెందిన మహిళ.. ఓ రొయ్యల ఫ్యాక్టరీలో పని చేస్తున్నట్లు, కంట్రాక్టర్ ముత్తుంగారి రమేష్ అనే వ్యక్తి తన కోరిక తీర్చాలని అడగగా, నిరాకరించడంతో మనసులో పెట్టుకొని, సాటి కూలీలతో పని చేస్తున్నపుడు దాడి చేశాడని, అవమానకరంగా మాట్లాడాడని, విచారించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, డీఎస్పీలు సింధుప్రియ, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

## కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలంలోని కసుమూరు గ్రామం చెందిన ఓ వివాహితపై ఆమె భర్త, అత్తమామలు కట్నం కోసం మానసిక, శారీరక వేధింపులకు గురిచేసిన ఘటన కలకలం రేపుతోంది. జ్యోతినగర్, కసుమూరు గ్రామానికి చెందిన తాటిపర్తి దొరసనమ్మ (28), తన భర్త తాటిపర్తి ప్రసాద్‌తో కలసి జీవిస్తోంది. పెళ్లైన కొంతకాలానికే ప్రసాద్‌తోపాటు కుటుంబ సభ్యులు మాధవి (అత్తకోడలు), చిలకమ్మ (అత్త), చిన్న పెంచలయ్య, బావమరిది పెంచలయ్య, పెంచలమ్మ అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించారు. అత్తింటి వేధింపులను భరించలేక బాధితురాలు సోమవారం విసత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 85, డౌరీ ప్రొహిబిషన్ చట్టం సెక్షన్లు 3 అండ్ 4, ఐపీసీ 498 కింద విచారణ ప్రారంభించారు.

# మహిళలు చైతన్యంతోనే సాధికారిత సాధ్యం : సీఐ





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మహిళలకు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, పాలన తదితర అన్ని అంశాల్లో ప్రభుత్వపరంగా ప్రోత్సాహం ఉందని, తగిన చైతన్యం పొందితే సాధికారిత సునాయాసంగా సాధ్యమవుతుందని ఆత్మకూరు సీఐ జి.గంగాధర్ పేర్కొన్నారు. ఈనెల 8వతేదీ అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కాలేజి, ఏపిబాలికల గురుకుల పాఠశాలల్లో విద్యార్థినిలకు సంబంధిత అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీలను సిఐ గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ గంగాధర్ మాట్లాడుతూ బాలికలు, విద్యార్తినీలు, ఉద్యోగినిలు, పాలకులు, గృహిణిలు, వృద్ధ మహిళలకు ప్రభుత్వాలు అనేక రాయితీలు,పౌష్టికాహారం, వైద్యసదు పాయాలు, పలు సౌకర్యాలు, రక్షణచట్టాలు, రిజర్వేషన్లు, స్థానికసంస్థల పాలనలో 50శాతం రిజర్వేషన్‌సౌకర్యం తదితరాలన్నింటిని కల్పిస్తుంద న్నారు. అన్నిఅంశాల్లో మహిళలు తగిన అవగాహన పెంపొందించుకొని చైతన్యవతంలైన మహిళాభ్యుదయం, మహిళాసాధికారిత, మహిళా సంక్షేమం, మహిళాభ్యుదయం సాధించగలరని గంగాధర్ పేర్కొన్నారు. అన్నిరంగాల్లో మహిళలు రాణించేలా, విజయవంతంగా ముందుకు సాగేలా, సమానత సాధించేలా అనేకానేక అవకాశాలున్నాయని, స్థానిక పాలనలో సగం రిజర్వేషన్ లభించిందని, చట్టసభల్లో కూడా రిజర్వేషన్ సౌకర్యం లభించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థినిలు అన్నిఅంశాలపట్ల అవగాహన పెంపొందించేలా తమవంతుగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా బహుమతీ ప్రధానం గావిస్తామని గంగాధర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలేజిల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత సమయంలోపల అర్జీల పరిష్కారానికి కృషి చేస్తాం

## తహశీల్దార్ కృష్ణ ప్రసాద్



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరు పేట మండలం కొత్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందుసోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అన్నీ శాఖల అధికా రులతో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ టీవీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. మండలంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని, గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారం కోసం మండల తహశీల్దార్ కార్యాలయం నందు జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో సమస్యలపై అర్జీలు సమ ర్పిస్తే, నిర్ణీత సమయం లోపల వాటిని పరిష్క రించడం జరుగుతుందని అన్నారు. ఏ సమస్య నైనా ముందు మండల అధికారుల దృష్టికి తీసుకువస్తే, పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఒక వేళ సమస్య పరిష్కారంలో జాప్యం వుంటే జిల్లా అధికారులకు అర్జీలు ఇవ్వవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేంద్రబాబు, మండల వ్యవసాయశాఖ అధికారి రఘునాధ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన భూముల దోపిడీ..



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గంలో గిరిజన రైతుల్ని మోసం చేసి, వారి భూములను లాక్కొన్న వైసీపీ నేతల భారీ కుంభకోణం వెలుగు చూస్తోంది. లింగగుంట గిరిజన కాలనీకి చెందిన ఏడుగురు గిరిజన రైతులకు ప్రభుత్వం గతంలో 6.20 ఎకరాల భూమి పంపిణీ చేసింది. ఆ భూముల్ని సాగుచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న గిరిజనుల్ని వైసీపీ నేతలు మోసగించారు. వైసీపీకి చెందిన ఆరుగుంట ప్రభాకర్ రెడ్డి, కోదండరామిరెడ్డి తదితరులు 'మీ భూమికి మంచి విలువ ఇప్పిస్తాం, సాయం చేస్తాం' అంటూ మాయమాటలు చెప్పి గిరిజనుల ఒరిజినల్ పట్టాలను లాక్కొన్నారని, ఎకరాకు రూ.10 లక్షలు ఇస్తామని మాటిచ్చి.. చివరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా భూముల్ని లాక్కున్నారన్నారు. తమ సొంత లాభం కోసం ఎకరా రూ.33లక్షలకు భూమిని ఫ్యాక్టరీలకు అమ్మేశారని మోసపోయిన గిరిజన రైతులు వెంకటాచలం తహసీల్దార్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. 'వైసీపీ నేతలు మమ్మల్ని నమ్మకద్రోహం చేశారు. మా భూములు తిరిగి ఇప్పించాలి లేదా న్యాయమైన పరిహారం చెల్లించాలి' అని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. టీడీపీ నేత చెన్నకృష్ణయ్య మాట్లాడుతూ.. 'గిరిజనులను మోసం చేసిన వైసీపీ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మా నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గిరిజనుల హక్కులకు అండగా ఉంటారు' అని స్పష్టం చేశారు.

# సింగిల్ యూస్ ప్లాస్టిక్ పై వ్యాపారస్తులకు నోటీసులు జారీ



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రలో రోజు రోజుకి పెరుగుతున్న జనాభా కాలుష్యం, వాతావరణ పరి స్థితులు అనుకూలించ కపోవడంతో క్లీన్ అండ్ గ్రీన్ అనే నినాదంతో రాష్ట్రం లో ప్రతి నియోజక వర్గం, పట్టణం, గ్రామం ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ఉండాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక నూతన ప్రణాళికను ప్రవేశపెట్టింది, వారి ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గంలో ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా ఉండేందుకు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం కావలి పట్టణంలో ప్లాస్టిక్ అమ్ముతున్న ప్రతి దుకాణం దగ్గరకు వెళ్లి మున్సిపల్ సిబ్బంది సింగల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించారు. ప్రభుత్వం వాడకూడదని వారికి నోటీసులు జారీ చేశారు. ప్రతి ఒక్కరు కూడా సహకరించాలని అటు లేని పక్షంలో దుకాణదారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం, భారీగా జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ బషీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్మెంట్ నిధుల చెక్కు అందజేత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణ పరిధిలోని ప్రభుత్వకు స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్మెంట్ కొరకు చెక్కును సోమవారం ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు ప్రభుత్వ ఉన్నత పాఠ శాల ప్రధానోపాధ్యాయులు వి.బాలకేశవులుకు స్కూల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్మెంట్ పనుల నిమిత్తం జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కుర్రపల్లి మెయిన్ పాఠశాల నుండి మిగులు నిధులను టీఈఓ ద్వారా లక్ష రూపాయల చెక్కును అందజేశారు.

## భవన నిర్మాణ కూలీల పెంపు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నిత్యావసర వస్తువుల, ఇతరత్రా ధరలు పెరిగిన దృష్ట్యా ఉదయగిరి ప్రాంతంలో భవన నిర్మాణ కూలీల రేట్లను పెంచినట్లు టీఎన్టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఉన్న కూలీ రేట్లకు అదనంగా రూ.50లు పెంచడం జరిగిందన్నారు. ఇక నుంచి బేల్దారి మేస్త్రీకి రోజుకు రూ.850లు, ఆడ కూలీకి రూ.550లు, మగ కూలీకి రూ.600లు నిర్ణయించామని, భవన నిర్మాణ యజమానులు సహకరించాలని ఆయన కోరారు.

## చిల్డ్రన్ హోమ్ పిల్లలకు అన్నదానం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్‌కి చెందిన ఉమ మహేశ్వరావు భార్య సురేఖ కుమార్తె నమస్వీ హరిని జన్మదినం సందర్భంగా పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులోని చిల్డ్రన్ హోమ్ నందు పిల్లలకు విశేష అన్నదాన కార్యక్రమం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ముని వెంకట సూర్య, సభ్యులు సురేష్ రాజు, మన్నెం లక్ష్మణ్రావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని ముసునూరులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్, ఎంఈఓ సి.హెచ్. వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. అనంతరం టెన్త్ క్లాస్, త్రాడ్ గ్రాండ్ టెస్ట్‌కు ఉండే విద్యార్థుల చదువుల గురించి, అలాగే సీడీ ఉన్నటువంటి విద్యార్థులు అందరూ కచ్చితంగా 100శాతం ఉత్తీర్ణత అయ్యే విధంగా చూడాలని డిప్యూటీ డీఈఓ ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులతో సబ్జెక్టు వారీగా రివ్యూ నిర్వహించి సీడీ ఉన్న విద్యార్థులకి ఏ విధంగా చొరవ తీసుకుంటే వారు పాస్ అవుతారో పలుసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సాగు చేసుకుంటున్న పేదవారికి పట్టాలు ఇవ్వాలి

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్ల గ్రామపంచాయతీ పరిధిలో మట్టెంపాడు నందు ఇనాంభూములను సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరుతూ నెల్లూరు నెల్లూరు సీపీఎం నెల్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు ఆర్డీఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్‌లు మాట్లాడుతూ.. ఎలాంటి హక్కులు లేక పోయినా రాచమల్లు రమేష్ అనే వ్యక్తి మట్టెంపాడు గ్రామంలో 15 ఎకరాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేసి మామిడి మొక్కలు నాటి ఉన్నాడని, గ్రామస్తులు అడిగినా లెక్కచేయకుండా మరోచోట 20 ఎకరాల చుట్టూ చదును చేసి ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నిస్తున్నా




దని తెలిపారు. కాబట్టి ఫేక్ పట్టాలను సృష్టించి రమేష్ వేసిన ఫెన్సింగ్ ను వెంటనే తొలగించి అక్కడ సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు గుడి రవీంద్ర, గుంటి నాగరాజు, శ్రీపతి వెంకయ్య, శ్రీపతి దయాకర్, ఎన్వి రమణయ్య, కేశం హరి, కవిలి సురేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు : తహసిల్దార్




**కావలి, మేజర్‌న్యూస్ :** ప్రజా విజ్ఞప్తుల రోజైన సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కావలి పట్టణం ముసునూరు అట్టల ఫ్యాక్టరీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు ఒక గ్రూపుగా ఏర్పడి అక్కడ ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి ఆ స్థలాల్లో అక్రమంగా ప్రవేశించి చుట్టుపక్కల వారు ఏమిటి అని ప్రశ్నించగా వారి మీద దౌర్జన్యానికి దిగుతూ ఇవి మావే అంటూ మహిళలు సైతం చూడకుండా బూతుల పురాణంతో మహిళలపై దౌర్జన్యానికి దిగుతున్న విషయాన్ని ఆ ప్రాంతపు వాసులు సోమవారం జరుగుతున్న గ్రీవెన్స్ డేకు రావడం జరిగింది. అనంతరం కావలి తహసిల్దార్ శ్రావణ్ కుమార్‌కు అర్జీ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొంతమంది ఈ స్థలాల్లో ప్రవేశించి అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని అది ఏమని ప్రశ్నించినప్పుడు మాపై దౌర్జన్యానికి తీరుతున్నారని తహసిల్దార్‌కి వివరించారు. అనంతరం పాత్రికేయులతో తహసిల్దార్ మాట్లాడుతూ.. ఎవరైనా తమ స్థలాల్లో అక్రమంగా ప్రవేశించాలని చూసిన ఫేక్ పట్టాలు తీసుకొచ్చి ఇవి మావి అని అన్నప్పుడు సంబంధిత లబ్ధిదారులు మా దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని వివరించడం తెలిపారు. లబ్ధిదారులు నిర్భయంగా వారి వారి స్థలాల్లో ఉండొచ్చునని ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని ఏ సమస్య వచ్చినా.. తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పాత్రికేల్లడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఇంతవరకు ఎవరి మీద ఇలాంటి ఫిర్యాదు రాలేదని వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా సమస్యపై వచ్చిన వారిని వెంటనే స్పందించిన తాసిల్దారు వీఆర్వోలను అక్కడికి పంపి విచారణ చేపట్టడం జరిగింది. అనంతరం అర్జీదారులు తాసిల్దారికి కృతజ్ఞతలు తెలిపారు.

## వీఎస్‌యూ-ఎన్‌పీఎల్ మధ్య భాగస్వామ్య ఒప్పందం దిశగా చర్చలు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, సీఎస్ఐఆర్ ఫిజికల్ లాబొరేటరీ (ఎన్‌పీఎల్), ఢిల్లీ డైరెక్టర్ డా. వేణుగోపాల్ అచంటను కలుసుకుని పరస్పర సహకారం, పరిశోధనా అవకాశాలు, విద్యార్థుల శిక్షణ, సాంకేతిక సహాయంపై సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో, ఇరు



సంస్థల మధ్య సహకార ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకోవడంపై చర్చించగా, త్వరలో దీనిని అమలు చేసే అవకాశముంది. విద్యార్థులకు పరిశోధనలో భాగస్వామ్యం కల్పించడం, ఆధునిక ప్రయోగశాలలు వినియోగించుకునే అవకాశం కల్పించడం వంటి అంశాలపై ప్రాధాన్యతనిచ్చారు. ఎన్‌పీఎల్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదిరితే, వీఎస్‌యూ పరిశోధకులు, విద్యార్థులు ఆధునిక సాంకేతికతలపై పరిశోధన చేసేందుకు అవకాశముంటుంది. త్వరలోనే ఈ ఒప్పందాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## బహిరంగ వేలం నిర్వహణ, వాయిదా



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వేంచేసియున్న వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానంకు పూర్తి హక్కు అనుభవం కలిగిన తలనీలాలు సేకరణ, చెప్పుల స్టాండ్ నిర్వహణ, ప్రింటింగ్ పనులు చేయుట, కరెంటు, ప్లంబింగ్ సామాన్ల సరఫరా, భక్తులు సమర్పించిన ముతక బియ్యం అమ్మకం, మర్యాద వస్త్రములు సరఫరా, కూరగాయలు సరఫరా, స్టేషనరి వస్తువుల సరఫరా చేయుటకు తాత్కాలిక హక్కులు పొందుటకు తేది 01-04-2025 నుండి 31-03-2026 వరకు సోమవారం కార్యనిర్వాహణాధికారి వేమూరి గోపి ఆధ్వర్యంలో ఈ ప్రొక్యూర్మెంట్, సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించగా తలనీలాలు సేకరణకు చెప్పుల స్టాండ్‌కు పాట పాడుటకు ఎవరూ ముందుకు రాక పోవడంతో వాయిదా వేశారు. అదేవిధంగా ప్రింటింగ్ పనులు చేయుట, కరెంటు, ప్లంబింగ్ సామాన్లు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు వేయగా భక్తులు సమర్పించిన ముతక బియ్యం అమ్మకం, మర్యాద వస్త్రములు సరఫరా, కూరగాయలు సరఫరా, స్టేషనరి వస్తువుల సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు ఎవరూ వేయక పోవడంతో వాయిదా వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, సిబ్బంది, పాట దారులు పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద కేంద్రాలపై శిక్షణ కార్యక్రమం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండల పరిధిలోని మన్నగదిన్నె గ్రామంలో సోమవారం వల్లేటివారిపాలెం మండలంలో పనిచేసే పంచాయితీ కార్యదర్శులకు, హరిత రాయబారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి మండలం ఎంపీడీవో, సీహెచ్ శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి ఇంటి నుండి చెత్తను ఏ విధంగా సేకరించాలి, సేకరించిన చెత్తను చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో ఏ విధంగా వేరు చేసి దానిని కంపోస్ట్ ఎరువుగా మార్చాలి, ఎరువుగా తయారైన వాటిని మార్కెట్ చేయడం ద్వారా గ్రామ పంచాయతీకి అదనపు వనరులను ఏ సమకూర్చుకోవడానికి కావలసిన వసతులపై పంచాయితీ కార్యదర్శులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ విస్తరణాధికారి ఎస్కే అబ్దుల్ సమద్, వల్లేటివారిపాలెం మండలపరిషత్ అభివృద్ధి అధికారి నరేంద్ర దేవ్, విస్తరణాధికారి, మన్నగదిన్నె పంచాయతీ కార్యదర్శి డి.గీత పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా విజ్ఞప్తుల దినోత్సవంలో 4అర్జీలు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ దినోత్సవం కార్యక్రమంలో నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసిల్దార్ శ్రీరామకృష్ణ తెలిపారు. అందులో రెండు అర్జీలు పట్టాదారు పాస్ పుస్తకాలు కోసం అన్ మ్యారీడ్ సర్టిఫికెట్ కోసం ఒకటి వన్ బి అడంగల్ మ్యూటేషన్ కోసం ఒక అర్జీ వచ్చాయని మొత్తం నాలుగు అర్జీలు ప్రజా విజ్ఞప్తుల దినోత్సవంలో వచ్చినట్లు తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** మండలంలోని రైతులందరూ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని మద్దతు ధర పొందాలని సోమవారం చేజర్ల రైతు సేవ కేంద్రం తనిఖీలో సూచించారు. కొనుగోలు కేంద్రాలలో ఏర్పాట్లను తహసీల్దార్ పరిశీలించారు. ధాన్యం ధరలు, అమ్మకాలపై ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షులు ఉడతా హాజరత్తయ్య, నాయకులు రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం పుట్టికి రూ.19720 చెల్లిస్తోందని, తక్కువకు అమ్మి నష్టపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వి.శశిధర్ వ్యవసాయ, సహకార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 9 మద్యం బాటిళ్ళ స్వాధీనం

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని కోడూరుపాడు నందు అక్రమంగా మద్యం అమ్ముతున్న బోయపాటి శ్యాంబాబు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 9మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ ప్రభాకర్ రావు తెలిపారు. హెడ్-కానిస్టేబుల్ ఫిరోజ్‌ఖాన్‌ను ఉన్నతాధికారులు అభినందించినారు.

# ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**జనసేన ఆవిర్భావ పోస్టర్‌ను ఆవిష్కరించిన జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి**




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఈనెల 14న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు కోరారు. సోమవారం నెల్లూరు నగరంలోని మాగుంట లేఔట్‌లో ఉన్న జనసేన నెల్లూరు నగర కార్యాలయంలో జనసేన ఆవిర్భావ దినోత్సవంకి సంబంధించి వాల్ పోస్టర్‌లను సుజయ్‌బాబు, జనసైనికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుజయ్ బాబు మాట్లాడుతూ.. జిల్లా పర్యవేక్షకులు, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సారధ్యంలో జనసైనికులు అందరూ ఈనెల 14న పిఠాపురంలో జరగనున్న ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని అన్నారు. జనసేన అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందని, అది కూడా జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో జరగటం సంతోషంగా ఉందన్నారు. నగరంలోని 54 డివిజన్‌ల నుంచి జనసైనికులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చప్పిడి శ్రీనివాసులు రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, నగర ప్రధాన కార్యదర్శి శనివరపు అజయ్ కుమార్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు బత్తల శ్రీకాంత్, చిత్తూరు రాము, వావిళ్ళ బాలాజీ, కనగలూరు సురేష్ నాగూర్ బాషా, నగర కార్యదర్శులు కొమ్మిశెట్టి ఉదయ్, ఆముదాల సుమంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి ప్రసన్నని కలిసిన వైసీపీ నాయకులు



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు కోవూరు నియోజకవర్గంలోని అనుబంధ విభాగాలకు సంబంధించి నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడిగా సిరం నవీన్ కుమార్, వాలంటీర్ విభాగానికి ఊటుకూరు మల్లికార్జున, ఇందుకూరుపేట మండలం సంబంధించిన మండల యువజన విభాగం అధ్యక్షుడిగా గొల్లపల్లి అవినాష్, పంచాయతీరాజ్ విభాగానికి వరిగొండ శ్రావణ్, వైయస్సార్ టియుసి విభాగానికి పామంజి కళ్యాణ్ నూతనంగా నియమించిన సందర్భంగా మాజీ మంత్రి, వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నలపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుగుణాభివృద్ధి చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, జొన్నవాడ దేవస్థానం చైర్మన్, ఇందుకూరుపేట మండల పార్టీ అధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి, రావూరు ఎంపీటీసీ బాలుబొమ్మ కరుణాకర్, ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ డైరెక్టర్ చిట్టిబోయిన కృష్ణ ప్రసాద్, వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# భూమికోసం దళిత గిరిజనుల పోరాటం




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం సోమవారం ఉటుకూరు గ్రామంలో ఎం/ఎస్ వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీ లీజు రద్దయినా.. భూములకు మాదిగులకు యాజమాన్య హక్కు కల్పించాలని, భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో గల ప్రభుత్వ, బంజర, మిగులు, పోరంబోకు భూములను దళితలకు ఇతర పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహశీల్దారు కార్యాలయం వద్ద దళితులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య మాట్లాడుతూ.. ఉటుకూరు గ్రామంలో ఎం/ఎస్ వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి గ్రామ సర్వే నెం.3, 20, 25-1, తురిమెర్ల గ్రామ సర్వే నెం.460, 461లలో 178.82 ఎకరాల భూమిని ప్రభుత్వం మైనింగ్ లీజుకు మంజూరు చేశారు. అయితే సదరు మైనింగ్ లీజు గడువు తేది.15.08.2023 నాటికి ముగిసిందన్నారు. సదరు భూమిలో మాదిగలు భూమిని ఆక్రమించి చెట్టు పుట్ట తొలగించే క్రమంలో పోలీసులు మాదిగలను భూమిలోనికి వెళ్ళనివ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణమే తహశీల్దారు స్పందించి మైనింగ్ లీజు రద్దైన భూములను పరిశీలించి మాదిగలకు వ్యవసాయం చేసుకొనుటకు అవకాశం కల్పించి, వారికి యాజమాన్య హక్కు కల్పించాలని అయన కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు పందిటి వెంకటయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కె.రమేష్, ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) నాయకురాలు బి.మమత, నాయకులు పి.పెంచలయ్య, పి.కోటయ్య, ఎ.అంకయ్య, ఎ.బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారవేధికలో 5అర్జీలు

● తహశీల్దార్ వెంకటేశ్వర్లు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** సోమవారం బుచ్చి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 5 అర్జీలు రావడం జరిగింది అని తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. అందులో 3 అర్జీలు సర్వేకి సంబిందించనవి కాగా, మిగిలిన రెండింటిలో ఒకటి ఫ్యామిలీ మెంబర్ మరియొకటి కారుణ్య నియామకంకు సంబంధించిందని ఆయన తెలియజేశారు.

## మా స్కూలు విద్యార్థులు ఇక్కడే ఉండాలి

▶▶ ఎస్ఎంసీ కమిటీ ఏకగ్రీవ తీర్మానం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మా స్కూల్ విద్యార్థులు ఇక్కడే ఉండాలని మరో స్కూలుకు పంపలేమని ముత్తుకూరు మండల కేంద్రంలోని ఎంపీపీ యుపీఎస్ స్కూలుకు సంబంధించిన విద్యార్థులు తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమవారం స్కూల్ వద్ద జరిగిన కమిటీ సమావేశంలో అనేక అంశాలను చర్చించారు. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉన్నటువంటి విద్యార్థులను సమీపంలోని జడ్పీ హైస్కూల్‌కు పంపలేమన్నారు. ముత్తుకూరు మండల కేంద్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న సందర్భంలో భారీ వాహనాలు ఎక్కువగా సంచారం చేస్తున్నాయని దీనివల్ల విద్యార్థులకు ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే ఉన్న స్కూల్ ఇంకా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉన్నారని పేర్కొన్నారు. అధికారులు ఆలోచించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశం గురించి మండల విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమావేశ మందిరానికి స్థలం కేటాయించండి

● చైర్ పర్సన్‌కు రిటైర్డ్ ఉద్యోగుల వినతి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** సమావేశ మందిరానికి స్థలం కేటాయించాలంటూ గ్రీవెన్స్ డే సందర్భంగా బుచ్చిరెడ్డి పాళెం పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళికి మాజీ ప్రభుత్వ ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో సంప్రదించి స్థలం కేటాయింపుకు తగు చర్యలు తీసుకుంటామని బుచ్చి పట్టణ గవర్నమెంట్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాలాద్రి, యానాదయ్యలకు చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి మాజీ ప్రభుత్వ ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ కమీషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల ఉద్యమం ఫలించేనా

- అమలుకునోచుకోని నాటి వైసీపీ సర్కారు హామీలు
- నేటి టీడీపీ హామీలపై ఎదురుచూపులు
- 42రోజుల సమ్మెకు లభించని ఫలితం
- 10న రాష్ట్ర ఆందోళనకు సమాయత్తం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ నియమాలమేరకు విద్యార్హతలు కలిగి, ఇంటర్వ్యూలల్లో నెగ్గి అంగన్‌వాడీ కార్యకర్తలుగా నామమాత్రపు గౌరవవేతనంతో నియమితులై దశాబ్దాల తరబడి కొనసాగుతుండగా వారికి కనీసవేతనాలు లబించే పరిస్థితి కానరావడంలేదు. నేటి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో కొండంత ఆశలు పెట్టకోగా ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లేనందున ఈనెల10 రాష్ట్రవ్యాపితంగా ఆందోళనకు అంగన్‌వాడీలు సమాయత్తమవుతున్నారు. 500 రూపాయలతో ప్రారంభమైన అంగన్‌వాడీ కార్యకర్తలు, 250రూపాయలతో ప్రారంభమైన అంగన్‌వాడీ సహాయకులకు తరచూ ఉద్యమాలు సాగించగా అప్పుడప్పుడూ ప్రభుత్వాలు కొద్దికొద్దిగా వేతనాలు పెంచి నేడు అంగన్‌వాడీ కార్యకర్తలు 11500రూపాయలు, సహాయకులు 7000రూపాయల గౌరవవేతనం పొందుతున్నారు. పూర్తిసమయం కేటాయించి చిన్నారులకు పూర్వప్రాధమిక విద్యను అందిస్తూ గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కనీసవేతనాలు కూడా లభించడంలేదంటూ గతసంవత్సరం డిసెంబర్12వతేదీనుండి జనవరి24వతేదీవరకు నిరవధికసమ్మె చేశారు. ధర్నాలు చేశారు. వివిదరకాల నిరసనలు చేశారు. అప్పట్లో అధికారవైసిపి మినహా అన్ని రాజకీయపార్టీలు, వివిద ప్రజాసంఘాలవారు మద్ధతిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉద్యమం కొనసాగింది. అయితే అప్పటి వైసిపి ప్రభుత్వం అనేకరకాలుగా వారిని బెదిరించారు. నోటీసులిచ్చారు. ఉద్యోగాలు తొలగిస్తామంటూ షోకాజ్‌నోటీసులిచ్చారు. సచివాలయసిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తామంటూ తాళాలు కూడా పగులగొట్టించారు. వారందరి ఉద్యోగాలు తొలగించి కొత్తవారిని


అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా (ఫైల్‌ఫోటో)

నియమించుకునేలా నోటిఫికేషన్లు కూడా సిద్దం చేశారు. దీర్ఘకాలింగా సంఘటితమైన అంగన్‌వాడీలు 44రోజులపాటు సమ్మెచేసి సంక్రాంతి,క్రిస్‌మస్ పండుగలను సైతం లెక్కచేయకుండా శిబిరాల్లోనే ఉన్నారు. పలుదపాలు అప్పటి వైసిపి ప్రభుత్వం ఉద్యమనేతలతో చర్చలు జరపడం, విఫలం కావడంతో 44వరోజుకు సమ్మె చేరిన సందర్భంగా ప్రభుత్వం తమ సలహాదారు సజ్జలరామకృష్ణారెడ్డిద్వారా ఉద్యమనేతలతో చర్చలు జరిపి కొన్ని హామీలిచ్చారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, 26వేలరూపాయల కనీసవేతనాలివ్వాలని, మినీఅంగన్‌వాడీలను మెయిన్‌లుగా మార్చాలని, పెన్షన్ అమలుచేయాలని, గ్రాట్యుటి ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమపధకాలు వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్‌బెనిఫిట్ 5లక్షల రూపాయలకు పెంచాలని, అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, యాప్‌లబెడద తొలగించి ఒకే యాప్ అమలు చేయాలని తదితర డిమాండ్లతో వారు దీర్ఘకాలిక ఉద్యమం సాగించారు.

**అమలుకాని వైసీపీ హామీలు :** చర్చలద్వారా అప్పటి వైసిపి ప్రభుత్వం కొన్ని హామీలివ్వగా జివోలిచ్చామన్నారే తప్ప అమలుకు నోచుకోలేదు. గ్రాట్యుటి ఇస్తామని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కార్యకర్తలకు 50వేలనుండి 1.2లక్షలకు పెంచుతామని, సహాయకులకు 40వేలనుండి60వేలకు పెంచుతామని, రిటైర్‌మెంట్ వయసు 60నుండి 62 సంవత్సరాలకు పెంచుతామని టిఏ,డిఏలు చెల్లిస్తామని హామీలిచ్చి ఆమేరకు జివోలిస్తున్నామని ప్రకటించారు. కనీసవేతనం, వేతనాల పెంపు విషయమై మాత్రం ఎలాంటి హామీ ఇవ్వలేదు. అయితే వారు ఈ ఉద్యమం అనంతరం 5నెలలు అధికారంలో ఉన్నా ఇచ్చిన హామీలను అమలుచేయకుండా నిర్లక్ష్యం చేశారని వారంతా వాపోతున్నారు.

**టీడీపీ హామీలపై ఎదురుచూపులు :** నాటి సమ్మె సందర్భంగా మద్ధతిచ్చిన తెలుగుదేశం అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ తదితరులు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని, వారి న్యాయమైన కోర్కెలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీలిచ్చారు. నాలుగురోజుల క్రితం మహిళా, శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామన్నారు. అయితే ఏమేరకు న్యాయం చేస్తారు, ఏ కోర్కెలను ఆమోదిస్తారో స్పష్టం చేయలేదు. అయినా తెలుగుదేశం పాలకులపై నమ్మకం ఉందని, తమకు తప్పకుండా న్యాయం చేస్తారంటూ అంగన్‌వాడీలు పేర్కొంటూ ప్రభుత్వ నిర్ణయాలకోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇంకా ఎలాంటి నిర్ణయం లేనందున మళ్ళీ ఆందోళనకు సిద్ధమయ్యారు. మరి అంగన్‌వాడీలకు ఎలాంటి ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందో చూడాల్సి ఉంది.

# మెప్మామార్కెటింగ్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మెప్మా ఆధ్వర్యంలో స్వయంసహాయక సంఘాల మహిళలు తయారుచేసి విక్రయానికి పెట్టిన అర్బన్‌మార్కెటింగ్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్ కోరారు. సోమవారం పట్టణంలోని అన్నాక్యాంటిన్ సమీపంలో మెప్మా టీఎంసీ జి.మాధవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెటింగ్ కేంద్రాన్ని కమీషనర్ గంగాప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డిలు ప్రారంభించారు. స్వయంసహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారుచేసిన వివిద రకాల బ్యాగులు, రెడిమేడ్ దుస్తులు, ఊరగాయలు, వివిదరకాల తినుబండారాలను ఈ మార్కెటింగ్ కేంద్రంలో విక్రయానికి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ.. మెప్మా ఆధ్వర్యంలో స్వయంసహాయక సంఘాల మహిళలు తయారుచేసిన వస్తువులను నెలకు 2రోజులు వంతున విక్రయానికి ఉంచుతున్నారన్నారు. కాగా ఈ మార్కెటింగ్ కేంద్రాన్ని ప్రతినిత్యం నిర్వహించేలా తమకు స్థలం కేటాయించాలని మెప్మా టీఎంసీ మాధవి కోరిందని, ఆమేరకు మున్సిపల్ కార్యాలయం ముంగట కేటాయించేలా రానున్న కౌన్సిల్ సమావేశంలో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళలు తయారుచేసి సరసమైన ధరలకు విక్రయిస్తున్నారని, అందరూ వాటిని కొనుగోలు చేసి ఆ మహిళల ఉపాధికి దోహదపడాలని కమీషనర్ కోరారు. పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి ప్రసంగిస్తూ స్వయంసహాయక సంఘాల మహిళలు స్వతహాగా తమ మేధస్సుతో తయారు చేస్తున్న వస్తువులను విక్రకయించుకునేలా మార్కెటింగ్ కేంద్రం ఏర్పాటు సంతోషదాయకమని, వారు నిరంతరం ఈ కేంద్రాన్ని కొనసాగించుకునేందుకు తమవంతుగా కృషిచేస్తామని పేర్కొన్నారు. మహిళలు స్వయంఉపాధికోసం ఈ విధంగా ప్రత్యేకతరహా వస్తువులను రూపొందించి మార్కెటింగ్ చేయడం శుభపరిణామమని, అందుకు తమవంతుగా సంపూర్ణసహకారమందిస్తామని కూడా చంద్రారెడ్డి పేర్కొన్నారు. మెప్మా టీఎంసీ మాధవి మాట్లాడుతూ.. పట్టణ సమాఖ్యలోని వివిద ప్రాంతాల మహిళలు స్వయం ఉపాధికోసం బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం కల్పించామని, దాంతో వారు తమ ఇళ్ళవద్దనే కుటీర పరిశ్రమలాగా వివిద రకాల వస్తువులను తయారు చేస్తున్నారన్నారు. వాటిని విక్రయించేందుకు మార్కెటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ప్రతినిత్యం ఈ కేంద్రం కొనసాగించేలా ప్రయత్నిస్తామని మాధవి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల మణిచందన తదితరులు వివిద రకాల వస్తువులను కొనుగోలు చేయగా మెప్మా ఆర్‌పిలు, స్వయంసహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు పంచాయితీ సంబంధించిన చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రం నందు సోమవారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చెత్త నుండి సంపద తయారు చేసే కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శు లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. గృహాల నుండి చెత్తను సేకరించుట, తడి చెత్త, పొడి చెత్త వేరుచేయుట, నాడెప్ తొట్లలో కంపోస్టు తయారీ, వర్మీ కంపోస్టు తయారీ, పశుపక్ష్యాదుల దహనవాటిక నిర్వహణ తో పాటుగా గ్రీనరీ పెంచే విధానం గురించి శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దగదర్తి మండలం విస్తరణ అధికారి శ్రీ చెంచమ్మ, బోగోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం, దగదర్తి మండలం పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్, బోగోలు పంచాయతీ కార్యదర్శి జహీర్ వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పై ప్రకటనలిస్తే చర్యలు తప్పవు

- డిఎం అండ్ హెచ్‌ఓ సుజాత హెచ్చరిక

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇస్తే చర్యలు తప్పవుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారిణి వి.సుజాత సోమ వారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించేలా గోడ పత్రికలు, హోర్డింగులు పెట్టినా, వాణిజ్య ప్రకట నలు చేసినా పీసీ అండ్ పిఎన్ డీటీ చట్టం, 1994 నిబంధనలు, 1996 క్రింద స్కానింగ్ కేంద్రాల నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. సుప్రీం కోర్ట్ ఆదేశాలు మేరకు అలాంటివి ప్రోత్సహించ కూడదన్నారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. అతిక్రమిస్తే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష రూ.50వేల నుంచి రూ.లక్ష రూపాయలు వరకు జరిమానా విధించబడునని తెలియ చేశారు. జిల్లాలో లింగనిర్ధారణకు సంబంధించి అవకతవకలకు పాల్పడితే టోల్‌ఫ్రీ 1800 425 3365 నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

## ఇంటర్ పరీక్షలకు నలుగురు విద్యార్దుల గైర్హాజరు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ జూనీయర్ కళాశాల్లో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరు రైన పరీక్షాఛీఫ్ సూపర్నెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు ఎం.వాసుబాబు, పి.జమున తెలిపారు. 336 మంది హాజరు కావల్సివుండగా 332మంది హాజరైనారన్నారు. ఈపరీక్షల ను ఫ్లయింగ్ స్క్వడ్ అధికారులు తనిఖీ చేశారన్నారు. పరిక్షా కేంద్రంవద్ద ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

## గ్రీవెన్స్‌లో ఆరు ఆర్జీల స్వీకరణ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రివెన్స్ డేకార్యా క్రమంలో తహశీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ అప్పాజీ పాల్గొని ప్ర జలనుంచి ఆర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రివెన్స్‌లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్క రిస్తున్నామన్నారు. ప్రజలు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రీవెన్సు అన్నిశాఖల అధికారులు హాజరుకావాల న్నారు. ఇకపై హాజరు కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామ న్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా చక్రస్నానం కార్యక్రమం



**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** బుచ్చినగర పంచాయతీ ఏరియాలోని రామకృష్ణ నగర్‌లో వెలిసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పుష్కరిణిలో చక్రస్నానం కార్యక్రమం జరిగింది.

# సీఎం పాలనా దక్షతకు బడ్జెట్ అద్దం పడుతోంది

- రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం కృషి చేస్తున్నారు
- మహిళా సంక్షేమానికి బడ్జెట్ లో పెద్దపీట వేశారు
- 2025-26 ఆర్థిక బడ్జెట్ లో నెల్లూరు జిల్లాకు భారీ కేటాయింపులు
- ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో నిత్యం ప్రజా సేవలో ఉంటాం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్మిర్మాణమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌పై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసలు గుప్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాలనా దక్షతను కొనియాడారు. ఈ మేరకు సోమవారం బడ్జెట్‌పై సమావేశం సందర్భంగా ఆమె అసెంబ్లీలో మాట్లాడారు. 2025-26 బడ్జెప్ పై సభలో తనకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పాలనా దక్షతకు బడ్జెట్ అద్దం పడుతోందని, పేదలను బలోపేతం చేసే విధంగా బడ్జెట్ రూపొందించారన్నారు. చంద్రబాబు రూపకల్పన చేసిన స్వర్ణాంధ్ర - విజన్ 2047ను సాకారం చేసే దిశగా బడ్జెట్ ఉందన్నారు. గత ప్రభుత్వ అసమర్థ పాలన, నిర్లక్ష్యంతో ఆర్థికంగా కుదేలైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక పరిపుష్టిని కలిగించే విధంగా బడ్జెట్ రూపొందించినందుకు సభా ముఖంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రాష్ట్రాభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తున్న ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు చేయడం ద్వారా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థమవుతోందని స్పష్టం చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్, జల వనరులు, రహదారుల అభివృద్ధి, పింఛన్లు, ఐటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా సంక్షేమానికి ఉదారంగా కేటాయింపులు జరిపి అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతను నిరూపించారన్నారు. బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, మహిళా శిశు సంక్షేమానికి రూ.4332కోట్లు కేటాయించడం గర్వించదగిన విషయమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇప్పటికే దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తూనే, తల్లికి వందనం పథకానికి రూ.9,407 కోట్లు కేటాయించారన్నారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లకు మేలు చేసేలా అంగన్వాడీల గ్రాట్యుటీ చెల్లింపుల కోసం 2025-26 బడ్జెట్‌లో 60కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. అంగన్వాడీల నిర్వహణకు రూ.878 కోట్లు కేటాయించ ద్వారా వాటి బలోపేతానికి సహకారం అందించారని కొనియాడారు. ఇక నెల్లూరు జిల్లాకు 2025-26 ఆర్థిక బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేసిన కారణంగా సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకు చెందిన సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. తెలుగు గంగ ప్రాజెక్ట్ కు బడ్జెట్‌లో రూ.345 కోట్లు, సోమశిల జలాశయానికి రూ.266 కోట్లు కేటాయించి అభివృద్ధికి బాటలు వేశారని ప్రశంసించారు. జిల్లాకు తలమానికమైన విక్రమ సింహపురి యూనివర్సిటీకి రూ.20.53కోట్లు కేటాయించడం కొత్త పరిశోధనలకు తోడ్పాడు అందనుండటం సంతోషం కలిగించే అంశం. అలాగే రామాయపట్నం పోర్ట్‌కు రూ.100కోట్లు, అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో 1.77లక్షల మంది రైతులకు రూ.247కోట్లు పంపిణీ కాబోతున్నాయని, జిల్లాలో 12వేల మంది మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం పెంచిన విధంగా వేట నిషేద భృతి అందజేస్తామని స్పష్టం చేశారు. అలాగే కొవడలూరు మండలంలో ఉన్న కిసాన్ సెజ్‌కు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానని, ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో తాను నిత్యం ప్రజా సేవలో ఉంటానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా పనిచేస్తానని ఆమె స్పష్టం చేశారు.

## అధికారుల పర్యవేక్షణ లేకుండా రోడ్డు విస్తరణ పనులు



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇందుకూరుపేట అధికారుల పర్యవేక్షణ లేకుండా నెల్లూరు మైపాడు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని మండల బీజేపీ అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నుండి మైపాడు వరకు 48 కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి రోడ్డుకు సిఆర్ఐఎఫ్ నిధులతో అభివృద్ధి చేసేందుకు 2023వ సంవత్సరం చివరలో అప్పటి వైసీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచి ఈ పనులను గుత్తేదారులకు అప్పగించారు. సంబంధిత పనులను రెండు సంవత్సరాలలోపు పూర్తి చేయాలని కాల పరిమితి నిర్ణయించారు. ఈ పనులు నెల్లూరు డివిజన్ పరిధిలో వుండాల్సి ఉండగా తమ స్వార్థం కోసం గత పాలకుల సహకారం తో కోవూరు డివిజన్‌కు మార్చుకున్నప్పటికి పనులు ప్రారంభం కాలేదు. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 25 శాతం కంటే తక్కువ పనిచేసిన వాటిని రద్దు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీనితో అప్రమత్తం అయిన గుత్తి దారుడు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి కొనసాగిస్తున్నారన్నారు. పనులు ప్రారంభించిన వెంటనే అధికారులు పని నిలుపుదల చేయాలని నోటీసులు జారీచేసిన గుత్తేదారుడు లెక్కచేయకుండా పనులు కొనసాగిస్తు న్నాడన్నారు. జరుగుతున్న పనులు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరగడం లేదని తెలిపారు. జిల్లా ఉన్నత అధికారులు కలుగజేసుకొని గుత్తేదారుడుపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరుగుతునందున అనుమతి లేని రోడ్డు విస్తరణ పనులు జరుగున్నందున రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోలేకపోతున్నారని తెలిపారు.

## ఏడాదికి రూ.20 కడితే.. రూ.2లక్షల బెనిఫిట్ : ఎస్‌బీఐ మేనేజర్ రాజు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** సామాన్య ప్రజలకు లబ్ది చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అందిస్తోందని అందులో ఒకటే ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన అని, సంవత్సరానికి రూ.20కడితే సరిపోతుంది. ఏకంగా రూ.2లక్షల బీమా లభిస్తుందని పొదలకూరు ఎస్‌బీఐ మేనేజర్ పీఎస్ రాజు అన్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాంపాటి రోశయ్య గత ఏడాది మే 13వ తేదిన తన వ్యక్తి గత ఖాతా ద్వారా ఈ పాలసీ చెల్లించారన్నారు. రోశయ్య జూన్ 1వ తేదిన తడలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో నామినీగా ఉన్న వారి కుమారుడు రాంపాటి వెంకటేష్‌కు తమ శాఖ దరఖాస్తు చేసుకున్న 10 రోజుల్లోనే పాలసి సొమ్ము రూ.2లక్షల మొత్తాన్ని సోమవారం, నామిని అయిన రాంపాటి వెంకటేష్‌కు అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పీఎస్ రాజు మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్ అనేది ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు పాలసీదారుడి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. ఈ విషయం అదరికీ తెలిసినా ప్రీమియం ఎక్కువగా ఉందన్న కారణంతో చాలా మంది సామాన్య, మధ్యతరగతి ప్రజలకు బీమా తీసుకునేందుకు వెనకడుగువేయకూడదన్నారు. ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన స్కీమ్ ద్వారా కేవలం ఏడాదికి రూ.20 కడితే ఏకంగా రూ.2లక్షల బీమా సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఇది ఒక ప్రమాద బీమా కవరేజీ పాలసీ అని, ఈ పాలసీ తీసుకున్న వ్యక్తి ప్రమాదంలో చనిపోయినా లేదా అంగవైకల్యానికి గురైనా అతని కుటుంబానికి బీమా సొమ్ము వస్తుంది. కార్యక్రమంలో అకౌంటెంట్ రవితేజ, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

## మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో ధ్వజావరోహణ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం ఉదయం స్వామి అమ్మవార్ల వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా రాత్రి శాస్త్రోక్తంగా ధ్వజావరోహణ నిర్వహించారు. అనంతరం ఊరేగింపుపై స్వామి అమ్మవార్లు దర్శనమిచ్చారు. వేడుకలు ముగింపు కార్యక్రమాలకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. భక్తులకు దేవస్తానం వారు తీర్థ ప్రసాదములు. ఈ వేడుకలు దేవస్థాన కార్యనిర్వహణాధికారి, ఆలయ సిబ్బంది ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించినారు.



# పేద ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన పార్టీ జనసేన

- విలువలు విశ్వసనీయతకు అద్దం పట్టే పార్టీ జనసేన
- పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే ఆదరించిన ప్రజలు
- ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు జనసేన పార్టీతోనే
- జనసేన పార్టీ నెల్లూరు పార్లమెంటు ఇన్‌చార్జ్‌గా వేములపాటికి ఇవ్వడం అభినందనీయం
- సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ పేదల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన పార్టీ అని ఆ పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలువలు విశ్వసనీయతకు అర్థం పట్టే పార్టీ జనసేన అని వ్యాఖ్యానించారు. పార్టీని స్థాపించిన అనతకాలంలోనే ప్రజల ఆదరణ పొందడం జరిగిందన్నారు. అందుకే గత ఎన్నికల్లో 21 సీట్లకు గాను 21 సీట్లు గెలుపొందడం జరిగిందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను క్రమం తప్పకుండా అమలు చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్- జిల్లాలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో జెండా పండుగ అంబరాన్ని అంటే ఎలా చేయాల్సి ఉంది అన్నారు. ప్రతి కార్యకర్త గర్వంగా చెప్పుకునే పార్టీగా నిలవాలి జిల్లాలో ఇప్పటికే సభ్యత నమోదులో రికార్డు సాధించాం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటామని తెలిపారు. జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ సారథ్యంలో జిల్లాలో పటిష్టమైన పార్టీగా రూపుదిద్దుకుంటుందన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14వ తేదీన పిఠాపురం ప్రత్యేక బస్సుల ద్వారా బయలుదేరి వెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నూనె మల్లికార్జున యాదవ్, సుందరమి రెడ్డి, గునుకుల కిషోర్, వై.రవి, కృష్ణారెడ్డి, ఆఫీస్ ఇన్‌చార్జ్ జమీర్, జనసేన నాయకులు వీరామహిళలు పాల్గొన్నారు.

# ఆమంచర్ల గ్రామ వీఆర్ఓ, సర్వేయర్‌పై ఆనం ఫిర్యాదు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం తహసిల్దార్ కార్యాలయం నందు తహసిల్దార్‌కి అప్పయ్యకండ్రిగ గ్రామస్తులు చింత సురేంద్రరెడ్డి, గ్రామస్తులతో కలిసి నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని అప్పయ్యకండ్రిగ నందు చింతా సురెంద్రరెడ్డి పడమర వీధిలోని తూర్పున పిత్రాజితపు స్థలంలో ఏలాంటి సమాచారము ఇవ్వకనే ఆమంచర్ల గ్రామంకు చెందిన మల్లినేని వేణుకు సంబంధించిన జేసీబీతో వీఆర్ఓ, సర్వేయర్, ఇరువురు కలసి వచ్చి హద్దు రూపములో వున్న కంచెను పూర్తిగా తొలగించారు. అనంతరం తహసిల్దార్‌ని దీనిపై విచారణ జరపాలని కోరారు. అదేవిధంగా దీనిపై నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది. తరువాత దీన్ని నకలు కూడా రెవిన్యూ డివిజనల్ అధికారికి ఇవ్వటం జరుగుతుంది. వెంటనే అధికారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ మండలం అధ్యక్షుడు పుచ్చలపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆమంచర్ల బిట్-2 ఎంపీటీసీ సభ్యులు సురేందర్ రెడ్డి, శివాజీ, వెంకటసుబ్బారెడ్డి, రఘురాంరెడ్డి, సుమన్‌రెడ్డి, సింహాద్రి, మస్తానయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిర్దిష్ట గడువులోపు పరిష్కారాలను అందించండి

## - అదనపు కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్ల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న స్థానిక సమస్యలకు నిర్దేశించిన గడువులోపు పరిష్కారం అందించాలని అధికారులను అదనపు కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. అదనపు కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో గృహాలు క్యాన్సిల్ అయిన వారికి వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించడంతోపాటు, ఆయా గృహాలను నూతన లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ప్రజలనుంచి ఎక్కువగా రోడ్ల మరమ్మతు పనులు, నూతన రోడ్ల మంజూరు, నూతనంగా డ్రైను కాలువల నిర్మాణం కోసం విజ్ఞాపనలు అందుకున్నామని తెలిపారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి అసెస్మెంట్ నెంబర్లలో చిన్నపాటి సవరణలు, మార్పు, చేర్పులను గురించి ఎక్కువగా వినతులు అందుకున్నామని వెల్లడించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి, మార్టగేజ్ విడుదల గురించి అర్జీలు అందుకున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-9, హౌసింగ్-17, టౌన్ ప్లానింగ్-9, రెవెన్యూ-1, పబ్లిక్ హెల్త్-4, డీఈఓ-1, మొత్తం-41 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సీపీ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులను రెచ్చగొట్టే కాకాణి.. నిజాలు వెల్లడించిన టీడీపీ




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం కసుమూరులో రైతులతో మాట్లాడిన తెలుగురైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరు రాధాకృష్ణమ నాయుడు, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిపై ఘాటుగా విమర్శలు చేశారు. ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉంది. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. కానీ, కాకాణి అబద్ధపు ప్రచారంతో రైతులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు అని రాధాకృష్ణమ నాయుడు తెలిపారు. వైసీపీ హయాంలో రైతులకు కనీస మద్దతు ధర అందలేదని, తాము అధికారంలోకి రాగానే తక్షణమే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశామని చెప్పారు. గత ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి పేరుతో మోసం చేసిందని, రైతులు ఆర్థికంగా నష్టపోయారని విమర్శించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకండి! ఓపికగా వ్యవహరించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి. గిట్టుబాటు ధరతో పాటు అన్ని రకాల ప్రయోజనాలు అందించేందుకు తెలుగుదేశం కట్టుబడి ఉంది అని నాయుడు హామీ ఇచ్చారు. రైతులకు ఏ సమస్య వచ్చినా, తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది. అవసరమైతే, వారి హక్కుల కోసం అసెంబ్లీలో పోరాడతాం అంటూ ధీమా వ్యక్తం చేశారు.

## వాహనదారులు..

# తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో వాహనదారులు డ్రైవింగ్ సమయంలో హెల్మేట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం పోలీసు స్టేషన్ సమీపంలోని మెయిన్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన హెల్మేట్ లేని, సరైన ధృవపత్రాలు లేని వారిని గుర్తించి ఫైన్ విధించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు వాహన ధృవపత్రాలు అందుబాటులో వుంచుకోవాలన్నారు. ఈనెల 1 నుండి మోటర్స్ యాక్ట్ ప్రకారం ఫైన్లు విధించడం జరుగుతుందన్నారు. వాహన దారులు తమ వాహనానికి సంబంధించిన పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాల న్నారు. పొల్యూషన్ సర్టిఫికేట్, ఇన్స్యూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి పుండాలన్నారు. లేనిచో భారీగా ఫైన్లు వేస్తామన్నారు. అనంతరం కొత్తమోటర్ వాహన చట్టంపై అవగాహన కల్పించారు. ఈకార్య క్రమంలో సిబ్బంది వున్నారు.

సూర్య
విలేకర్లు కావలెను
తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9963827227

## వాట్సప్ ద్వారా అందుబాటులోకి..

# 32 రకాల ప్రభుత్వ సేవలు

● అదనపు కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నూతనంగా 32 రకాల ప్రభుత్వ సేవలను వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారు ఉత్తర్వులను జారీ చేశారని నెల్లూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ వైఓ నందన్ ఒక ప్రకటనలో సోమవారం తెలియజేశారు. వాట్సాప్ సేవలను ఈ ఏడాది జనవరి 30వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకుని వచ్చి 9552300009 నెంబర్ ద్వారా ఆస్తి పన్ను, నీటి చార్జీలు, మురుగు నీటి కనెక్షన్, ట్రేడ్ లైసెన్సులు, వివాహ నమోదు, మొదలగు సేవలతో కలిపి మొత్తం 32 రకాల పౌర సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శకంగా సరళవంతమైన, సులభతరమైన పౌర సేవలను అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు కమిషనర్ ఆకాంక్షించారు.

## అంగన్వాడీలకు రవాణా భత్య నగదు పంపిణీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఇటీవల 6రోజులపాటు జ్ఞాన జ్యోతి శిక్షణ పొందిన అంగన్వాడీ కార్య కర్తలకు రావల్సిన రవాణా భత్య నగదును ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యకర్తలు ఆరు రోజులపాటు శిక్షణ తరగతులకు హాజరైనారని, వారికి రవాణా ఛార్జీల కింద రోజుకు రూ.50 వంతున ఒక్కొరికి రూ.300మతున చెల్లించామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ తేజస్విని కార్యకర్తలు పాల్గొన్నారు.